

# రాబందుల నీడ

పెద్దమర్రి చేరేటప్పటికే అరగంట పట్టింది, వెంకన్నకి. ఈ లెక్కన నడక ఇంకా గంటేనా పడుతుందనుకున్నాడు. ఆ రోజు పని అయిపోయిన తరువాత, సాయంత్రం, ఏడు ఏడున్నరకి భోజనంచేసి బయల్దేరేరు వాళ్ళు ...ఎప్పుడూ అలాగే ఆ టైముకే బయలుదేర తారు. కాని ఆ రోజు ఆలస్యమైంది నడక.

నిన్నపనిలో....లారీ లోడ్ చేస్తుంటే జారి, కాలు మడతపడి కుడిపాదం బెణికింది. నిన్నటి బెణుకు ఈవాల్టికి బాగా మోపుచేసి అడుగు తొందరగా సాగనివ్వటం లేదు.

ఆలస్యం గుర్తింపు కొచ్చేటప్పటికి అక్కడంతా వెళ్ళిపోదా మనుకున్నాడు. కానీ కుడికాలు బాగా బరువుగా వున్నట్టనిపించింది. తలొంచి చూసుకుంటే పాదం చుట్టూ చీకటే తప్ప పాదం కనబడ లేదు. తలెత్తి చూశాడు మర్రివేపు రోడ్డుకి ఎడం పక్కన వంద గజాల్లో ఎవరో నిలబెట్టిన పెద్ద చీకటి గొడుగులా కనిపించింది వెంకన్న కది, ఆ రోడ్డమ్మట వచ్చి పోయేటపుడు చాలాసార్లు చూశాడు దాన్ని...,చూసినప్పుడల్లా తనుండే రేకులగది గుర్తొస్తుంది. మర్రి చెట్టుకీ, తనుండే రేకులగదికీ ఏమిటో సంబంధం—ఎన్నిసార్లు ఆలోచించినా వెంకన్నకి అంతుపట్టలేదు.

ఇంచుమించు ఏడాది క్రితం మొదటిసారిగా యిదే మట్టిరోడ్డమ్మట నడుస్తూ దాన్ని చూశాడు. ఆ రోజు మటుకు పెద్దగా పరికించి చూళ్ళేదు. ఏదో యీదాలాపంగా చూశాడు.... చూసిన ఆ ఒక్కక్షణంలోనే తనుండే రేకుల గది గుర్తొచ్చింది....ఆ గుర్తు ఎంతోసేపు నిలవలేదు.

ఆ రోజు చాలా చిత్రమైన కంగారులో వున్నాడు తను. అసలు వెళ్దాం వెళ్దాం అని చెప్పి ఆ ప్రయాణం పెట్టింది సాంబడు. తీరా చివరికి పేటలో కూచుని...."మళ్ళీ ఎప్పుడేనా వెళ్తాంలే. ఆట మంచి పట్టులోవుంది." అని ఎగ్గొట్టేశాడు. సాంబణ్ని ఎలాగేనా ఆటలోంచి లేవదీయాలని ఒకటి రెండు చిన్న ప్రయత్నాలు చేసినా సాంబడు కదల్లేదు.

ఉంటున్న వూరే కొత్త వెంకన్నకి. అక్కడ కొచ్చి అర్నెల్లు కూడా కాలేదప్పటికి.

ఉద్యోగంకోసం ఎక్కడెక్కడో దేవుళ్ళాడుతుంటే, ఈ వూళ్లో కాకినాయి తవ్వకం జరుగుతోందని. ఏదో పని అక్కడ దొరక్కపోదని ఎవరో చెప్పేరు అప్పటి తన పరిస్థితిలో వెనకా ముందూ ఆలోచించకుండా, బయల్దేరి ఆ వూరొచ్చాడు. వూళ్ళో బస్ ఉగేటప్పటికి యింకా వెలుగు పూర్తిగా రాలేదు. ఎదురుగా చిన్న పాక హోటలుంటే కాఫీ తాగి వాళ్ళనీ వీళ్ళనీ వాకబుచేసి నెమ్మదిగా చేరాల్సిన చోటికి చేరాడు.

అక్కడ మూసేటప్పటికి వాళ్ళంతా ఓ రెండొందలమందేనా వుంటారనిపించింది. గునపాల చప్పుడూ....సుత్తిమోతలూ.... రాళ్ళ పగుళ్ళూ....చల్లటిగాలీ ...వల్పటి ఎండా....చూస్తూ నిలబడిపోయాడు.

అప్పుడే బాగా పైకొస్తున్న సూర్యుడి వెలుగు ఆ పెద్దపెద్ద జేగురురంగు రాళ్ళమీద పడి మెత్తగా జారిపోతోంది....జారిపోతున్న వెలుగులో ఆకుపచ్చ గీతలు మెరుస్తున్నాయి వాటిమీద.

ఓ కాలు మడతపెట్టిన సాంబు, చేతిలో సంచీతో నిలబడి చిత్రంగా చూస్తూన్న ఆ కొత్త మొఖాన్ని అటువేపు వెళ్తున్న

సాంబడే ముందుగా పలకరించాడు...."ఎవరు కావాలి" అని....అటు ఇటు దిక్కులు చూస్తున్న వెంకన్నకి ఏం జవాబు చెప్పాలో వెంటనే తట్టక సాంబణ్ని ఎగాదిగా చూస్తుండి పోయాడు.

పొట్టిగా పిక్కలా మనిషి....చిన్న కాకీ నిక్కరు....నీలం రంగు గళ్ళ బుషోర్కటు....మెళ్ళో చేతి రుమాలు....పక్కపాపిడి....చిత్రంగా కనిపించాడు సాంబడు వెంకన్నకి.

మెల్లిదిగా తేరుకుని "ఎవరూ అక్కర్లేదు" అన్నాడు చిన్నగా నవ్వు తెచ్చుకుంటూ.

ఆ నవ్వు కనిపెట్టినట్టు "పనికోసమా?" అన్నాడు సాంబడు. వెంకన్న ఔనన్నట్టు తలూపగానే దగ్గరుండి తనే తీసికెళ్ళాడు పెద్ద మేస్త్రీ దగ్గరికి.

ముందు రాళ్ళు కొట్టే పనిచ్చారు వెంకన్నకి. అలవాటు లేని పని. ఆ రోజంతా నానా యాతనపడ్డా....సాయంత్ర మయ్యేసరికి చేతుల్లాగేయి కాని తోటివాళ్ళు చేసిన పనిలో నాలుగోవంతు పనైనా చేయలేదు. ఇంక అందరూ ఇళ్ళ కెళ్ళిపోతుంటే తనెక్కడి కెళ్ళాలో తోచలేదు వెంకన్నకి. అది చూసి సాంబడు అడిగేడు-"కూడా యింకెవ్వరూ రాలేదుకదూ" అని వెంకన్న రాలే దన్నాడు.

"మా ఆడాళ్ళు లేరు—నిన్ననే పుట్టింటికి పురుటి కెళ్ళారు. ఐదారు నెల్లదాక నేనొక్కణ్నే. ముందు నాల్రోజులు అక్కడుంటే తర్వాత ఏదోటి చూసుకోవచ్చు." అని. యింటికి తీసికెళ్ళాడు.

మొదటి రెండు నెలలూ సాంబడితోడులో బాగానే గడిచి పోయాయి వెంకన్నకి. కలిసి పనిలో కెళ్ళటం, రావటం. వండుకు తినటం, పండుకోటం తప్ప పెద్దగా ముఖ్యమైన విషయాలేమీ జరుగ లేదు. జరిగిన మార్పల్లా రాళ్ళుకొట్టే పనిలోంచి లారీ లోడింగు లోకి మార్చారు వెంకన్నని.

మూడోనె లొచ్చేటప్పటికి సాంబడు అప్పుడప్పుడు రాత్రిళ్ళు యింటిపట్టు నుండేవాడు కాదు. ఏ తెల్లారుఝామునో వచ్చి మొద్దు నిద్ర పోయేవాడు. పొద్దున్నే పనిలో కెళ్ళానికి ఎంతో కష్టంమీద నిద్ర లేచేవాడు.

ఒకసారి వెంకన్న చొరవగా అడిగితే చెప్పాడు సాంబడు. "పేట....కెళ్ళొచ్చా"నని. అలా చెప్పిన తర్వాత ఆ విషయం పెద్దగా పట్టించుకోలేదు వెంకన్న.

నాలుగోనెల మధ్యలో వెంకన్న మకాం మార్చాడు. వూరికి రాయితవ్వకం జరిగేచోటికి అరమైలు దూరం వుంటుంది. తవ్వకం జరిగేచోట ఏ యిల్లూ లేదు. అందుకని గునపాలు, పారలు, గబేళాలు పెట్టుకోటానికి ఓ రేకులగది కట్టించారు. వెంకన్న ఒంటి గాడని తెలిసి, మేస్త్రీ, వుంటే అందులో వుండమని చెప్పాడు.

ఎప్పటికేనా ఓ గూడు అవసరమేకదా అని మాట్లాడకుండా ఒప్పుకున్నాడు వెంకన్న-అప్పు డంతకన్నా ఎక్కువగా ఆలోచించ లేక పోయాడు.

పగలు పని జరుగుతున్నంతసేపు ఎంతో హడావిడిగా వుండే ఆ చోటు రాత్రిళ్ళు నిశ్శబ్దంగా వుండేది. క్రమేపీ అలవాటైనా.... వెంకన్నకి ఒంటరితనం బాగా తెలిసొచ్చింది. ఆ ఒంటరితనంలోనే సాంబడు చెప్పిన పేట గుర్తొచ్చింది.

తనూ పేట రావాలనుకుంటున్నానన్న సంగతి వెంకన్న సాంబడితో చెప్పటానికి మరోనెల పట్టింది. ముందు విన్న సాంబడు చిన్నగా నవ్వాడు....నవ్వి ఆ రోజు ప్రయాణం పెట్టేడు....పెట్టి పేకాటలో కూచుని లేవక పోయేఅప్పటికి ఏం చేయాలో తోచలేదు వెంకన్నకి.

పేటకి దారి సాంబడు చెప్పేడు కానీ కొత్త. ముందుగానాలుగు రోజుల్నుంచి ఆ ప్రయాణం వూహించుకోటంలో వున్న ఉబలాటం వెంకన్నని నిలవనివ్వలేదు. చివరికి ఒంటరిగానే బయల్దేరాడు. ఆ రోజు రాత్రి దృష్టంతా వేరేచోటుమీదే వుంది. ఎక్కడ దారి తప్పి పోతుందోనని సాంబడు చెప్పిన దారి గుర్తు చేసుకోటం మీదేవుంది. అందుకని ఆ రోజు మర్రిచెట్టుని చాలా యథాలాపంగా చూశాడు.

ఆ రోజు నడవటం కూడా చాలా తొందరగా నడిచాడు వెంకన్న. పేట చేరటానికి గంట కూడా పట్టలేదు. సాంబడు

చెప్పిన గుర్తుల ప్రకారం ఆ యిళ్ళ దగ్గరి కెళ్ళేటప్పటికి మరోపావు గంట పట్టింది.

వెంకన్న నడిచొచ్చినమట్టిరోడ్డు పేట కాలవ మీద వొంతెనని కలుస్తుంది. వంతెన దాటి కుడిచేతివేపు తిరిగి కాలవమ్మటే ఎగువకి నడిస్తే నాలుగో లైటు స్థంభం దగ్గరని చెప్పాడు సాంబడు. వెంకన్న సరిగ్గా నాలుగో లైటు స్థంభందగ్గర నిలబడి చూశాడు..... రాత్రి తొమ్మిద దాటుతున్నా పేటలో సందడి తనుండే వూరుకన్న ఎక్కువగా వున్నట్టే కనపడింది. నెమ్మదిగా రోడ్డు మీంచి పల్లంలోకి దిగేడు. ఎదురుగా పాకలు కనిపిస్తున్నాయి. వాటిలో అక్కడోటి అక్కడోటి లైట్ల వెలుగు లేకపోతే మట్టికుప్పల్లా కనిపించేవి.

'ఔనా.....కాదా' అని తటపటాయిస్తూ కాసేపు నిలబడ్డాడు వెంకన్న. పదినిమిషాలు గడవక ముందే ఓ పన్నెండేళ్ళ కుర్రాడు రెండుసార్లు వెంకన్నచుట్టూ తిరిగాడు....తిరిగి "వస్తారా" అన్నాడు నెమ్మదిగా.

"ఎక్కడకి" అన్నాడు వెంకన్న గబుక్కున.

"పాకల్లోకి—" అన్నాడు కుర్రాడు, మరింత నెమ్మదిగా.

అవేశని పిర్ధారణై పోయింది వెంకన్నకి. వెంకన్న రోడ్డువేపు చూస్తూ మాట్లాడలేకపోయేసరికి మరోసారి అడిగి వెళ్ళిపోయాడు కుర్రాడు.

వెళ్తున్నది పాకల్లోకే అయినా అంత చిన్న కుర్రాడితో కలిపి వెళ్ళాలనిపించలేదు వెంకన్నకి. కుర్రాడు వెళ్ళిపోయేక పాకల వేపు నడిచాడు. వీధి మొదట్లో వున్న రెండు పాకల తలుపులు వేసేసి వున్నాయి. మూడోపాక గుమ్మంలో కూచునుంది ఆమె....వెంకన్నని చూడగానే లేచి నిలబడింది. పాకలోని లైటు వెలుగు చాలాకొద్దిగా పడుతోంది వీధిలోకి, ఆ వెలుగులో ఆ మనిషి కొద్ది లావుగా, పుష్టిగా వున్నట్టు మాత్రం తెలిసింది వెంకన్నకి.

వెంకన్న దగ్గరికి రావటం చూసి ఓ అడుగు గుమ్మంలోకి వేసి....'రండి' అంది.

ఆమె వెనకాలే లోపలి కెళ్ళాడు. వొత్తి తగ్గించుకున్న

హాఁకెసులాంతరు తప్ప ఏం కనపడలేదు ముందు. లాంతరు హెచ్చించింది. ఆమె హెచ్చించిన లాంతరు వెలుగు ఆడుసు గోడమీదికి....గోడమీది అద్దం మీడికి....అద్దంపైన దువ్వెనమీదికి పాకింది.

సాధ్యమైనంత వరకు వెలుగులోకి తిరిగింది తను. ఎత్తుగా బుగ్గ, పన్నటి గీతలా కలిసిన పెదాల అంచులు, పొడుగాటిముక్కు, ముక్కుపుడక....సగం తిరిగినట్టు చెవికమ్మ.

ఆమె ముఖం పూర్తిగా కనబడలేదు వెంకన్నకి. చూస్తున్నా నన్న గ్రహింపు లేకుండా చూస్తున్నాడు. గుండ్రటి భుజంమీంచి... జాకెట్టు బిగువుమీంచి జారుతున్న వెంకన్న చూపుల్ని...."ఏం వుంటారా?" అన్న ఆమె మాటలు కాస్సేపు కదలకుండా చేశాయి. పెద్దగా ఏ ఆలోచనా లేకుండానే వుంటానన్నట్టు తలూపాడు వెంకన్న.

ఆమె వెళ్ళి చెక్క తలుపు దగ్గరగా లాగి గొళ్ళెంవేసి వొస్తుంటే వెంకన్న చూపులు గుమ్మందాకా వెళ్ళొచ్చాయి. తలుపు పక్కగా పొడుగాటి చెక్కబల్లుంది. నూఁసీసా....ఓ గ్లాసు.... ఇంకా ఏవో ఒకటిరెండు సీసాలు వున్నాయి దానిమీద.

తనొచ్చి లాంతరు తీస్తుంటే చూశాడు .... అంతవరకు లాంతరు చిన్న అడ్డగోడమీ దుంది. అదే ఆ చిన్న పాకని రెండుగా చేస్తోంది.

ఆమె లాంతరు తీసుకుని మళ్ళీ గుమ్మంవేపు వెళ్తుంటే ఏం చెయ్యాలో తోచక అలాగే నిలబడ్డాడు. క్రిందగా ప్రక్కనే పక్క పరిచుంది. అటువేపు తిరిగి లైటు పైకెత్తి తగ్గిస్తుంటే తన మెడ వెనకనుంచి వెలుగు తగ్గుతూ లాంతర్లోకి వెళ్ళిపోయింది. లాంతరు చెక్కబల్ల మీద పెట్టి దగ్గరగా వచ్చి "కూచోండి" అంది.

ఓసారి అటూ ఇటూ చూసి చెప్పు లొడలి పక్క చివరగా కూచున్నాడు. తనూ కూచుంది,

ఇందాటికన్నా చీకటిగా వుంది. మనిషి దగ్గరగా వుండటం మూలాన్ని కనిపిస్తోంది.

"కొత్తకదూ...." అంది కొద్దిగా వెంకన్న వేపు తిరుగుతూ.

భార్యకాక యింకా ఒకరిద్దరు ఆడాళ్ళని వెంకన్న ఎరుగును. కానీ ఇలా రావటం కొత్తే ఆమె కెలా తెలిసిందా అనుకున్నాడు.

"బాగా అలవాటున్నాళ్ళయితే బేరాలాడకుండా వూరుకోరు." అంది నెమ్మదిగా నవ్వుతూ.

వెంకన్న నవ్వాడు. జేబులోంచి డబ్బు తీశాడు.

"తర్వాత ఇవ్వొచ్చులెండి." అంది దగ్గరగా జరుగుతూ.

ఆ రోజు వెంకన్న బాగా తొందరపడ్డాడు. ఉద్రేకపడ్డాడు. ఎంతోసేపు గడవకుండానే ఆపుకోలేనంత నిద్దరొచ్చింది. నిద్ర పోయే లోపల జరిగిన వాటిలో బాగా గుర్తుగా తెలిసిందొక్కటే వెంకన్నకి.

"రాత్రంతా ఉంటారా?" అని ఆమె అడగటం.

ఆరునెల్లగా అలవాటులేని పనిలో, రాళ్ళు కొట్టటంలో, లారీలు నింపటంలో అలసిన వెంకన్న వొళ్ళు, మనసు విశ్రాంతిగా పడుకున్నాయి ఆ రాత్రి. తెలతెల వారుతుండగా మెలకువ వొచ్చింది వెంకన్నకి.

పక్కకి తిరిగి చూశాడు. చాలా అడ్డదిడ్డంగా పడుకునుంది. అరచేతి మీద ఓ బుగ్గ పరుచుకునుంది. రెప్పలు నిండుగా మూత పడున్నాయి.

రాత్రికన్నా బాగా కనపడింది ముఖం. మళ్ళీ ఎక్కడేనా చూస్తే పోల్చుకోగల దిప్పుడు. అలాగే తన ముఖంలోకి చూస్తుంటే గబుక్కుని భార్యముఖం గుర్తొచ్చింది వెంకన్నకి. పోలిక ఎక్కడో ఉన్నట్లు తోచింది. అది తృప్తో, ఇబ్బందో తెలియకపోయినా ఓ చిత్రమైన అనుభూతి కలిగింది.

ఆ రోజు పనిలోకి రావటానికి ఓ గంట ఆలస్యమైంది. సాంబడు కనిపించి "రాత్రి వెళ్ళేవా?" అనడిగేడు నవ్వుతూ.

ఇంచుమించు ఆ రోజంతా గుర్తొస్తూనే వుంది గడిచిన అనుభవం. తనకన్నా ఎక్కువగా ఆ పాక, పరిసరాలు గుర్తొచ్చాయి:

మర్నాడు మరీను. అతికష్టంమీద నాల్రోజు లాగ్గలిగాడు. ఐదోరోజు మళ్ళీ బయల్దేరాడు.

రెండోసారి నడకలో దారి బాగా అలవాటుగా వుంది. పెద్ద మర్రి, చెరువు, వొంతెన, నడక తరగడానికి గుర్తులుగా ఏర్పడ్డాయి. పాక దగ్గర కెళ్ళేటప్పటికి తలుపేసుంది. ఒకటి రెండు నిముషాలు నిలబడ్డాడు వెంకన్న. ఇబ్బందిగా అనిపించింది. ఓ ఐదు నిమిషాలు గడిచినా పాక తలుపులు తెరుచుకోలేదు. మరో పాకలోకి వెడదామా అనుకున్నాడు. అనుకోడంలోనే ఆ ఆలోచన తెగి పోయింది. నెమ్మదిగా వెనక్కి నడచి రోడ్డుదగ్గర కెళ్ళాడు. మనసంతా ఏదోలా అనిపించినా, ఆమెని వెంటనే చూడాలని బలమైన కోరిక పుట్టింది.

కాస్సేపటూ ఇటూ తిరిగి మళ్ళీ వెళ్ళాడు. గుమ్మం దగ్గరే గుర్తుపట్టి లోనికి తీసికెళ్ళిం దామె.

అంతకు ముందే తను రావడం, ఇబ్బందిగా నిలబట్టం, వెనక్కి వెళ్ళటం ఇవన్నీ చెప్పాలనుకున్నాడు. కానీ చివరికి "ఇందాక వచ్చి కాస్సేపు నిలబడి వెనక్కి వెళ్ళాను." అని అన గలిగాడు పొడిగా. తల వొంచుకోటం తప్ప ఆమేం మాట్లాడలేదు. వెళ్ళి తలుపే సొచ్చింది.

ఆ రాత్రి వెంకన్న ఎక్కువగా మాట్లాడాడు. ఆమె పేరుఅడిగాడు. ఒకటి రెండుసార్లు 'వరాలు' అని పేరుతో పిలిచాడు కూడా. మొదటి రోజుకన్న దగ్గరగా అనిపించింది ఆమె. ఇద్దరూ ఆ రాత్రి చాలాసేపు నిద్దర పోలేదు. తెల్లారి వెళ్ళిపోతూ-

'మళ్ళీ వారం ఇదేరోజు వస్తా'నని చెప్పాడు వెంకన్న.

ఆ తర్వాత చాలాసార్లు వెళ్ళాడు. వెళ్ళి పోయేటప్పుడు మళ్ళీ ఎప్పు డొచ్చేదీ చెప్పి వెళ్ళేవాడు. వెంకన్న వెళ్ళినప్పుడల్లా ఆమె గుమ్మం దగ్గరే కూచునుండేది.

ఏడాదిగా తనతో కలిపి గడిపిన రాత్రుళ్ళలో ఎన్నో అనుభవాలు పోగేసుకున్నాడు వెంకన్న.

వరాలు విషయాలు చాలా తెలిశాయి వెంకన్నకి. ఒక్కోసారి రెండు మూడు రోజులు ఆమె భోజనం లేకుండా టీలతో గడుపు

తుందని తెలిసి చాలా బాధపడ్డాడు. అది తెలిసిం తరువాత తను వచ్చినప్పుడల్లా తినగా మిగిలిన అన్నంవున్నా, కూరున్నా, ఏదున్నా తీసుకొచ్చి పెట్టేవాడు. ఒక్కోసారి మొత్తమంతా మూట కట్టుకొచ్చే వాడు. ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ తినేవారు.

వరాల్తో ఏదో ఒకటి మాట్లాడుతుంటే హాయిగా ఉండేది వెంకన్నకి. తను చేసే పని గురించి, నడిచొచ్చే దారి గురించి, పొంటకి గురించి, ఇలా....వరాలు దగ్గర ఏం దాచుకోలేదు వెంకన్న. చెప్పగలిగినవన్నీ, చెప్పాల్సినవన్నీ చెప్పాడు. వరాలూ చాలా విష యాలు చెప్పేది.

ఒకళ్ళ నుంచి ఇంకొకళ్ళు దాచుకోవాల్సిన రహస్యాలేం వుండేవి కావు. ఇద్దరికీ భయాల్లేవు, కట్టుబాట్లు లేవు, అబద్ధాల్లేవు. తృప్తిగా ఉండేది కలిసున్నపుడల్లా. తన దగ్గరి కొచ్చేవాళ్ళ గురించి, వాళ్ళ ప్రవర్తన గురించి చాలా మామూలుగా చెప్పేది ఆమె.... అన్నిట్లాగే అదీ వినేవాడు వెంకన్న. ఆ పాకలో వస్తువులు, ఆమె తెలిపిస్తే ఆ పాకచుట్టూ ఉండే బతుకులూ, తిండితిన్నా లేకపోయినా తప్పని సరిగా కట్టాల్సిన అద్దెలూ....ఒంటిని దొలిచుకుతినే రోగాలూ ....వాటితోపాటు పోలీసుల మామూళ్ళ, పీడింపులు అన్నీ తెలిశాయి వెంకన్నకి ఏడాదిలో....

• • • •

రోడ్డు పక్కగా కూచున్న వెంకన్న ఒకసారి కుడి పాదాన్ని తడిమి చూసుకున్నాడు. కొద్దిగా వాచిన ట్లనిపించింది. పొద్దునా చెప్పు తొడగనివ్వలేదు. రెండు వారాల క్రితం వరాలు దగ్గర్నించి వొచ్చేటప్పుడు ఈ రోజు వస్తానని చెప్పేడు. ఎదురు చూస్తూం టుంది....తను ఎదురు చూట్టం ఎలా వుంటుందో వెంకన్నకి తెలుసు.

ఆ గుమ్మంలో కూచుంటే ఎవరో ఒకరు రాబోతారు పాక లోకి, వద్దని వాళ్ళతో చెప్పినా....సంపాదన మీద ఆశ పీకుతూనే వుంటుందట....ఆ విషయం ఆమే చెప్పిందోసారి.

నెమ్మదిగా లేచాడు వెంకన్న....పెద్ద మర్రి దాటి ముందుకు నడిచాడు. వెంకన్నకి దారిలో మర్రిలాగే మరో గుర్తు చెరువు....

దాన్ని చూపినప్పుడల్లా పుట్టి పెరిగిన వూరు. ఆ వూళ్ళో పెద్ద చెరువు గుర్తొస్తాయి. చెరువుతోపాటు అక్కడ గడపిన రోజులు. పెళ్ళి.... మొదటి కాన్పులో పోయిన భార్య—ఇలా తెరలు తెరలుగా అడుగుల్తో పాటు ఆలోచనలు కదుల్తాయి.

ఇదివరకు పేట వెళ్ళాలనుకున్నప్పుడల్లా ఏ గొడవా వుండేది కాదు. కానీ మూణ్నెలుగా మేస్త్రీ గొడవ పెడుతున్నాడు—ఎలా తెలిసిందో? ఇప్పటికే ఐదారుసార్లు చెప్పాడు...."నువ్వు రాత్రిళ్ళు షెడ్డులో ఉండటం లేదట-సామాను జాగ్రత్త అని" పోనీ వూళ్ళో ఏదేనా ఇల్లు చూసుకొని మారిపోదామంటే మేస్త్రీ వదనివ్వడు.... "నువ్వేదో పనిచేస్తావని కాదు. రాయి పనిలో కెలాగూ పనికిరావు షెడ్డో ఉంటావనే ఇందులోనైనా వుంచుకుంది." అన్నాడు ఓసారి తెగేసి మేస్త్రీ. ఆ రోజు నుంచి ఆ రేగుల గదిలో ఒంటరితనం మరీ ఇబ్బందిగా ఉంది. 'ఈ ఆలోచనల్తో....చీకటిలో....కాలు నెప్పితో ఈ ప్రయాణాలు లేకుండా వుంటే....తనని, ఆ పాకలో వచ్చీ పోయేవాళ్ళ మధ్య లేకుండా తీసుకొచ్చి తనతోనే తన దగ్గరే ఉంచు....ఎదురు గొప్పు తగిలి కొద్దిగా తూలాడు వెంకన్న.

ఎంత తొందరగా నడవా లనుకున్నా గంట పైనే పట్టింది అక్కడికి చేరటానికి. సందు మొగలోంచే చూశాడు పాక గుమ్మం వైపు. వరాలు అక్కడ కూచునిలేదు.

పాక తలుపు ఓరగా వేసుంది. దగ్గరి కెళ్ళి నెమ్మదిగా తోశాడు. లోపల లాంతరు ఆరిపోతున్నట్టు వెలుగుతోంది....చాప మీద వెల్లకిత్తలా చీకటి పోగులా పడుకునుంది తను.

'నిద్దర పోతోంది....' అనుకున్నాడు.

నెమ్మదిగా తల కదిపింది ... వెంకన్న వేపు చూసి ఎడంచెయ్యి కొద్దిగా ఎత్తింది.

"ఏమైంది?" అన్నాడు వెంకన్న. లాంతర్ ఒత్తి పెద్దది చేస్తూ.

"జరం....కడుపు నొప్పి...." అంది చాలా చిన్నగా.... ఒణుకుతూ వినిపించింది వరాలు మాట. చాపమీద పక్కనే

కూచున్నాడు. మెడమీద చెయ్యేసి చూశాడు. వేళ్ళ చివర్లలోంచి వేడి అరిచేయంతా పాకింది. వెంకన్న చేతిని తీసేసుకోబోతుంటే తన చేత్తో పట్టుకుంది వరాలు.

పదిహేను రోజులక్రితం తను చూసిన మనిషిలో ఈ మనిషి సగం లేదనిపించింది వెంకన్నకి. ఎన్నాళ్ళనుంచో తన లోపల దాక్కొని పీక్కుతింటున్న రోగం....లోపలికేం దొరక్క, బయట పడినట్టు నీరసించి పోయింది వరాలు. బట్టలు బాగా మాసిపోయున్నాయి. చీర కుచ్చిళ్ళు వూడదీసినట్టు చాలా ఒదులుగా ఉన్నాయి.

చుట్టూ ఓసారి చూశాడు వెంకన్న. తను పడుకున్న పక్కకి పక్కనే గోడవారగా ఎన్నో వృమ్ములు తడిగా మెరుస్తూ కనిపించాయి.

"ఆకలేస్తోందా?" అన్నాడు...,వేస్తోందన్నట్టు తలూపింది. నెమ్మదిగా తన చేతిలోంచి చేతిని తీసుకొని లేచాడు. బల్లమీద గ్లాసుంటే తీసుకొని బైటికి నడిచాడు. రాత్రి ఆ టైములో ఒంతెన మీద తప్ప దగ్గర్లో మరేదుకాణం వుండదు. అక్కడికెళ్ళి రెండు బన్ రొట్టెలు కొన్నాడు. గ్లాసులో టీ పోయించాడు. జేబులో ఉన్న ఒక్కనోటు ఇస్తే నాలుగు రూపాయి కాయితాలు, కొంత చిల్లరా ఇచ్చాడు దుకాణం వాడు.

వెంకన్న లోపలి కొస్తూంటే తను నెమ్మదిగా లేచింది. జ్వరానికి నాలుక చచ్చి రుచి తెలియలేదు. ఆకలి మరీ ఎక్కువైంది. ఎంతో ఆత్రంగా అందుకున్న రొట్టెలో సగంకన్న ఎక్కువ తిన లేక పోయింది. వెంకన్న బలవంతం మీద....టీలో ముంచుకొని మిగిలిన సగంతింది. తిన్నాక నెమ్మదిగా వొరిగి మళ్ళీ పడుకుంది. మిగిలిన రొట్టె పొట్లంకట్టి బల్లమీద పెట్టి, కాసిన్ని నీళ్ళు తాగొచ్చి తన పక్కనే అడ్డగోడకి చేర్లబడి కూచున్నాడు. నెమ్మదిగా తల తిప్పింది వెంకన్న వైపు. లైటు వెలుగులో...,ఆ కళ్ళల్లో సన్నటి నీటి పొర కనిపించింది వెంకన్నకి....వరాలు పెదాలు. బుగ్గలు వొణి కాయి—ఏవో చెప్పాలన్నట్టు....నెమ్మదిగా నీరసంగా....చివరికి "నువ్వూ పడుకో" అంది.

అలాగే అన్నట్టు తలూపేడు వెంకన్న. లైటు తగ్గించి తన

తల నిమురుతూ పక్కనే ఇందాకటిలాగే గోడకానుకొని కూచున్నాడు. మాని ఎండిపోయి. దుమ్ముపట్టిన వెంట్రుకలు గరుగ్గా తగులుతున్నాయి వేళ్ళకి. తలెత్తి పైకి చూశాడు....పాక కప్పు చీకటిగా....చీకటి గూడు కట్టుకున్నట్టు కనిపించింది....నెమ్మదిగా కళ్ళు మూసుకు కున్నాడు.

కాస్సేపటికి....మొదటి నిద్ర తెర కళ్ళని నిండుగా ముంచేస్తుంటే వెంకన్న కళ్ళ ముందు చీకటిగూడు కనిపించింది....అందులోంచి ఎన్నో రాబందులు రెక్కలాడించుకుంటూ బైటికొచ్చాయి. రకరకాల రంగులున్నాయి వాటికి....కొన్ని పాకంతా కలయ తిరిగాయి...కొన్ని పాక చుట్టూ ఎగిరాయి....ఓ రాబందుకి చిత్రంగా ఎర్రటి టోపీ ఉంది...మరో రాబందు కాజాకిళ్ళీ నముల్తూ, ముక్కులోంచి అప్పుడప్పుడు రక్తాన్ని వుమ్మేస్తోంది.

ఆలా మగతగా రెండుమూడు గంటలు పడుకున్నాడు వెంకన్న. మధ్యలో అలికిడైతే వులిక్కిపడి లేచాడు.

వరాలు మెలికలు తిరిగిపోతోంది....ఆయాసపడుతోంది.... లైటు హెచ్చించాడు.

మూలుగుతూ పాములా మెలికలు తిరుగుతోంది. వెంకన్న లేవటం చూసి నెమ్మదిగా వెంకన్నని పట్టుకొని లేచింది. బైటికి తీసుకెళ్ళ మన్నట్టు సైగ చేసింది. గుమ్మం దాటుతుండగానే పెద్దగా వాంతి చేసింది. కాసిని మంచి నీళ్ళిచ్చాడు .... సొమ్మసిల్లిపోయి పడుకుంది కాసేపు...నొప్పి తగ్గలేదు. మూలుగుతూనే వుంది. ఆయాస పడుతూనే ఉంది; ఏం చెయ్యాలో తోచలేదు వెంకన్నకి.

"ఏదేనా మందెయ్యాలి" అనుకున్నాడు. డబ్బులేదు, నాలుగు రూపాయలే ఉంది. నెమ్మదిగా కుదుపుతూ అడిగాడు, "డబ్బుందా" అని. అలాగే ఆయాసపడుతూనే లేదన్నట్టు సైగ చేసింది వరాలు.

మొదటికన్నా ఆయాసం ఎక్కువవుతోంది. మాటి మాటికీ పొట్ట పట్టుకొని, కాళ్ళు ముడుచుకొని బాధపడుతోంది వరాలు. వెంకన్న ఇక ఉండలేకపోయాడు, గబుక్కున తలుపు తీసుకొని బైటికి నడిచాడు.

పాకల మధ్యలో, ఆ పెంకుటిల్లు తెలుసు వెంకన్నకి. గబగబా వెళ్ళాడు—రంగమ్మిల్లది. ఇంచుమించు ఆ పాకలన్నీ ఆమెవే. ప్రతిపాకకి పదిహేను రూపాయలు అద్దె. ఇలా వొళ్ళమ్ముకునే వాళ్ళు కాకుండా మరెవ్వరేనా ఉంటే మూడు రూపాయలకన్నా ఎక్కువ అద్దె ఇవ్వరు ఆ పాకలకి. పాకల్లోవాళ్ళ దగ్గర నెల కాగానే రాక్షసిలా అద్దెవసూలుచేస్తుంది రంగమ్మ. దగ్గరికేసుకున్న తలుపుని దబ దబా బాదాడు వెంకన్న. లోపల్నుంచి గొణుగుతూ వచ్చి తలుపు తీసింది రంగమ్మ. వరండాలో లైటు వేసింది. వెంకన్నని చూసి. "ఏంటి" అంది పిసుగ్గా, నోరంతా తెరుస్తూ. కారాకిళ్ళీకి గార పట్టిన పెదాల్నిండా పాకింది వెలుగు.

"డబ్బుందా, ఓ పది రూపాయ" అన్నాడు.

వెంకన్నకు రంగమ్మ తెలుసు, కాని రంగమ్మకి వెంకన్నెవరో తెలియదు.

"డబ్బేమిటి. ఎవరు నువ్వు." అంది.

"ఆ పాకలో వరాలుకి జ్వరంగా ఉంది. వెంటనే డాక్టర్ని తీసుకు రావాలి. మళ్ళీ డబ్బు రేపిస్తా, ఉంటే తొందరగా ఇవ్వండి." అన్నాడు వెంకన్న.

"అర్ధరాత్రి నా దగ్గరెక్కడుంటుంది డబ్బు? పాకలో వాళ్ళకి మామూలే జబ్బులు; కొత్తేంకాదు. డాక్టరు వొద్దు, ఏం వొద్దు. అయినా మధ్యలో నీకెందుకీ గొడవ? వెళ్ళు. వెళ్ళు." అంది. రంగమ్మ డబ్బు ఇవ్వదని నిర్ధారణగా తెలిసి పోయింది వెంకన్నకి. కనీసం డాక్టరు ఇల్లన్నా ఆనవాలు చెప్పమన్నాడు. విసుక్కుంటూనే చెప్పింది....

వెంకన్న తిరిగొచ్చేటప్పటికి వరాలు కదలకుండా శోషొచ్చి నట్టు పడుంది. ముందు ఏదో తెలీని భయం వేసింది వెంకన్నకి. భుజం పట్టుకుని కుదిపాడు. నెమ్మదిగా కళ్ళు తెరిచింది. తెచ్చిన బిళ్ళ వేసి మందు తాగించాడు. బిళ్ళ మింగుతున్నప్పుడు, మందు తాగు తున్నప్పుడు వెర్రిగా చూసింది వరాలు వెంకన్న వేపు.

ఆ తర్వాత తెల్లారటానికి మిగులున్న రెండు గంటల్లో జర

గాల్పిన వప్పి చాలా తొందరగా జరిగిపోయాయి....మళ్ళీ ఇంకోసారి మందుతోసహా లోపల మిగిలిపోయిన రొట్టెపీ, వోపికనీ కక్కుకుంది వరాలు...కాసేపు కోడిపెట్టలా గింజుకుంది నెప్పితో. తెలతెల వారుతుండగా....వెంకన్న చేతిని తన చెంపమీదికి లాక్కుంటూ...వెర్రిగా వెంకన్న వేపు చూస్తూ....అయాసపడుతూ చచ్చిపోయింది.

వెంకన్నకి ఏడుపు రాలేదు చాలాసేపు. కాస్సేపటికి లేచి నెమ్మదిగా వెళ్ళి రంగమ్మని నిద్దరలేపి సంగతి చెప్పేడు. తిట్టుకుంటూనే వచ్చింది.

ఎవ రెవరికో కబురుపెట్టింది. నలుగు రైదుగు రొచ్చారు కాస్పేపటికి. ఎండ వొడ పడుతుండగా చాపతోసహా వరాల్ని పాక బైటికి తీసుకొచ్చారు. మామూలుగా తిరిగేజనం సందడి ఎక్కువైంది. కొంచెం దూరంగా రాయిమీద కూర్చున్నాడు వెంకన్న. పడుకున్న వరాలు వేపు చూస్తూ...

రోడ్డమ్మట వెళ్తూ ఆగి వింత తెలుసుకుంటున్న ఎవరో మనిషికి ఇంకొకళ్ళెవరో చెప్పారు. "ఏముంది మామూలే. దిక్కులేనిచావు. నీతిలేని మనుషు లింకెలా చస్తారు?" అని.

ఆ మాటలు వెంకన్నకి వినపడ్డాయి. నీతిలేక కాదు చచ్చిపోయింది: డబ్బులేక. సరైన బతుకులేక, చాలీ చాలని సంపాదన పీక్కుతినే రాబందులనుంచి రక్షణలేక, పెరిగే రోగాలు బాగు చేయించుకోలేక! అంతేకాని నీతిలేక కాదు!" అనుకున్నాడు. అందుకే కళ్ళనిండుగా నీళ్ళొచ్చాయి.

ఆ నీళ్ళు గొణుక్కున్నాయి "వరాలు ఇంకా నాలుగు రోజులు బతికుంటే. బతికుంటే-" అని.

మరోగంటకి ముసలి ఎద్దొకటి మునిసిపాలిటీ బండిని లాక్కొచ్చింది. ఇద్దరు సాయంపట్టి వరాలుని అందులో ఎక్కించారు. ఎవరూ ఏడవలేదు. బండి కదలకుండానే చాలామంది పాకల్లోకి వెళ్ళిపోయారు.

ఆశ చావక వెంకన్న బండి వెనకనే కొంతదూరం నడిచాడు.

('వసుధ' తొలి సంచికలో ముద్రితము)